



## పుట్టుమచ్చలు

నూతన విద్యార్థికూటములో చేరిన యువకులలో రామం ఒకడు. పదేండ్ల వయస్సు మించిన బాలికలందరు అతనిదృష్టిపథంలోయుండేవారు. అతని చిలిపి చేష్టలకు కొందరు స్త్రీలు అసహ్యపడేవారు.

హొటలులో భోజనముచేయుచు, ఒక గదిలో బసపెట్టుకొని, ప్రణయ మేగ్జయినులను పారాయణచేయుచూ ఒంటరిగా స్వేచ్ఛాజీవనము చేయు విద్యార్థియైన రామంకు తనగది ఊడ్చే నిమిత్తం ఒక ఆడదాసి కావలసి వచ్చెను. అతను బేరముచేయక అడిగినంత జీతం చెల్లించి ఒకపడుచుపిల్లను దాసీగా నియమించుకొనెను. ఆమె పేరు లక్ష్మి. గాని వృత్తిధర్మముచే అందరు లచ్చి యని పిలచేవారు. ఆమె ప్రణయమును వాంఛించే రామం కొన్ని నూతన అవకాశములను కల్పించెను. హొటలుకు వెళ్లి భోజనముచేయుటకు బదులుగ కేరేజితో ఆమెద్వారా భోజనము బసకు తెప్పించేవాడు.

లోకంలో కూటికిపేదయైనను కులానికి పేదయైనవారుండరు. లచ్చి గౌరవ కుటుంబమునకు చెందిన పిల్ల. ఆమె పరపురుషులను సోదరులవలె భావించేది. ఆమె మనస్తత్వం రామంకు తెలియదు.

ఒకనాడు రామం వాలుకుర్చీలో కూర్చుని సిజర్‌సిగరెట్టుకాలుస్తూ లచ్చి చెయ్యిపట్టుకొనెను. అతని చూపులను బట్టి అతని తలలో చెలరేగే దురాలోచన లచ్చి గ్రహించింది. చెయ్యి విడిపించుటకు పెనగులాడింది. గాని ఆమె నిరాయుధురాలైనఅబల. వెంటనే అతని పెదిమల నడుమ యిమిడి యున్న కాలుచున్న సిగరెట్టును ఆమె అందుకొని అతని బుగ్గలపైని రెండు చురకలు పెట్టింది. ఇంతలో రామం చెయ్యిపట్టువిడింది. ఆమె గబగబ పరుగెత్తింది అంతే......

ఇప్పుడు రాముకు వరకట్నాలతో పెళ్లయింది. ఇద్దరు బిడ్డల తండ్రి కూడాను. అతని బుగ్గమీద లచ్చి పెట్టిన చురకల మచ్చలు శాశ్వతంగా ఉన్నాయి. యెవరైనా అడుగుతే అవి పుట్టుమచ్చలని రామం బొంకుతాడు.

ఎం. ఎస్. ప్రకాశం.

* * *

## దినచర్య

ప్రొద్దున్నే లేవటం, సరిగా ముఖమైనా కడగకుండా ఏకాఫీహొటల్లోకో దూరటం; పొట్టనిండా దిట్టంగా మెక్కటం; బయటికి రావటం, తరువాత వీధులవెంట తిరుగుతూ కొంతకాలాన్ని గడపటం, ఆ తరువాత ఏ లైబ్రరీలో దూరటం; అక్కడ ఏరాజకీయపు గొడవల్లోనోబడి తర్క వితర్కాలతో మరి కొంతకాలాన్ని అర్థంలేకుండా వ్యర్థం చేయటం; తదుపరి మధ్యాహ్నం ఏ ఒంటిగంటకో ఇంటికి చేరటం, "ఇంత వరకు ఎక్కడ తిరిగావురా" అని పెద్ద వాళ్ళు అడిగితే, వాళ్ళను దబాయించి ఏదో సాకుచెప్పి తప్పించుకోవటం; తరువాత రెండు మెతుకులు నోట్లోవేసుకొని మరల సాయంకాలానికల్లా ఏ సినిమాహాలుదగ్గరో చేరటం, అక్కడ ఆడవాళ్ళగేటుదగ్గరనుంచోని స్త్రీలవైపు క్రీగంటి చూపులుచూస్తూ పోజులు విసరటం; ప్రొద్దుకూకంగానే చీకటిమరుగుల్లో ఆడాళ్ళ వెంటపడటం; వాళ్ళచేత చెడామడా నాలుగు తిట్లుతినటం; ముఖం తెల్లచేయటం; గుడ్లు తేలవేయటం; తరువాత గుటకలు మింగుతూ నిరాశతో, నిస్పృహతో, నిస్సత్తువగా, కాళ్ళీడ్చుకుంటూ రాత్రి ఏ పదిగంటలకో ఇంటికి చేరటం.........

ఇది ఈనాటి చాలామంది యువకుల దినచర్య. కాదంటారా మీరు?

నంద్యాల కొండమాచార్యులు.

* * *

## డార్క్‌రూమ్‌లో బ్లాకు

ఒక కిరసీన్‌డీలర్ కోమటిచమత్కారముతో దొంగలాభాలు విరివిగా పొందేవాడు. ఒకరోజున జాలిగొలిపే మాటలతో ఒకాయన వచ్చి "నాకీ వూళ్ళో కొత్తగ బడిపంతులుగా వేశా

రండి. ఇంటిలో పురుడు సమయము వచ్చింది. వచ్చేది కొత్త. కార్డుపెట్టుకో లేదు. కటాక్షించి ఒక పావుటిన్ ఖరీదుకు దయచేసి చీకటింటికి వెలుగు పెట్టండి బాబూ!" అన్నాడు. ఇప్పుడు శెట్టికి వికాసము హెచ్చింది. అసలు చీకటికొట్టు బేరాలను ఆహుతయింది తప్పుని సరిగా బడిపంతుళ్ళేగా. ముసలి కోటుతో అర్థాకలితో కాలేకడుపు కప్ప బడినా, ముఖాన్నే అకలివ్యేకమయే దీనతతో మర్యాదగా ఎట్టెదుటనున్న యీతనితో అన్నాడు. 'పోలీసుబంట్రోతు నుండి బడి పంతులువరకు కార్డు లేకుండ యివ్వాలంటె స్టాకు ఎక్కడ నుండి వస్తుంది. ఇష్టమైతే బ్లాకులో అందిస్తా.'

అయ్యా కిరసిన్ వైటులోను, రెడ్ లోను ఉంది కాని బ్లాకులో వచ్చిం దండీ అన్నాడు పేలముఖంతో అయ్యవారు. ఏమి అమాయకమయ్యా. బ్లాకు మార్కెటింగు రేటులో రు 3-0-0 లు చెల్లించి పావు డబ్బా పట్టుకువెళ్ళు అన్నాడు సూటిగా వర్తకుడు. సొమ్ము చెల్లించేడు. విజలు ఊదేడు. దాపులో నున్న పోలీసులు చేరారు. అంతా సి. ఐ. డి. తమాషా అని తెలిసికున్నాడు శెట్టి. కంగారుపడ్డాడు. చీకటికొట్టులో బందీయైనాడు; కటకటాలలో కటకట పడ్డాడు. డాక్కురూములో 'బ్లాకు' అంటూ కలవరించేడు.

ఎస్. వెంకట నాయుడు.

* * *

## స్వాగతము

తన వివాహం నెల రోజులుండవన్న దగ్గరనుంచీ, తన పెళ్లినాటికి తప్పకుండా రమ్మని మా జనార్దన్ పట్టు పట్టడంచేత నేను మొదట వెళదామనే అనుకున్నాను. కాని వాడిపెళ్లికి వారం రోజులు ముందుగా మా మామగారి దగ్గరనుంచి సామర్లకోటలో మా మరదలుకు పెళ్లవుతుందన్న శుభలేఖ రావడం చేత ఒక స్నేహితుడి పెళ్లికోసం మామగారి ఆహ్వానాన్ని తిరస్కరించడం యిష్టంలేక సామర్లకోట వెళ్లడానికి ఒక వారంరోజులు సెలవుపెట్టి బయల్దేరా. నేను పెట్టె బేడా సర్దుకుంటూండగా జనార్దన్ వచ్చి "ఏంరా! బ్రదర్! ఎక్కడేమిటి కమాను?" అని అడిగాడు. నేను సంగతంతా చెప్పి "క్షమించు బ్రదర్! రెండూ పెళ్లిళ్లూ ఒక్క ముహూర్తానే అవుతున్నాయి. ఇప్పుడు కాని వెళ్లకపోతే తన కూతురు పెళ్లికి రాలేదని మా మామగారు మాగుమ్మం త్రొక్కడు! మరేమీ అనుకోకు అని చెప్పి బయల్దేరా...... నేను సామర్లకోట చేరేసరికి మాముగ్గురు తోడల్లుళ్లూ వచ్చారు... మగపెళ్లివారు రాత్రి రాజమండ్రీనుంచి వస్తారనితెలిసింది. నన్ను మామామగారారాత్రి పెళ్లివార్కి స్వాగతమిచ్చేందుకు ఒక కారిచ్చి స్టేషనుకి పంపించాడు. నేను స్టేషను చేరేసరికి ట్రయిను 40 నిముషాలు లేటని తెలిసింది. ఏమిచేయడానికి తోచక నేను సీటుమీద చేరబడ్డా. చల్లనిగాలివీచడం చేత నాకు వెంటనే బాగా నిద్రపట్టింది. నేను నిద్రలేచేసరికి ట్రయిను స్టేషన్ని వదలి పావు గంటయిందని తెలిసింది. నేను తడబడుతూ లేచి ప్లాటుఫారం అంతా వెదికాను. నాకు పెళ్లివారు కనబడలేదు. కాని మా జనార్దన్ కనిపించాడు. తనపెళ్లికి కాకినాడ వెళుతున్నాననీ, ఆరాత్రి అక్కడెక్కడేనా బస చేసి తెల్లవారుఝామున కాకినాడ ప్యాసింజరుకందుకుంటామనిచెప్పాడు. "మరెక్కడో ఎందుకు ఈరాత్రికి మా యింట్లోనే వుందురు గాని రారా!" అని చెప్పి ఆ వచ్చిన పదిమందిని కార్లో మాయింటికి తీసుకొనివెళ్లా. కారు ఇంటి ముందు ఆపి ముందుగా ఈసంగతి మామగారికి చెప్పాను. పెళ్లివారికోసం వండిన వంటలు బావుగావుండడంచేత మామామ అత్త సరే నన్నారు. నేను వెంటనే ఈసంగతి జనార్దనకి చెప్పి అందరిని ఇంట్లోకి తీసుకొనివెళ్లాను. వాళ్లనుచూచి మామామగారు "అదేమిటిబాబూ! పెళ్లివారు రాలేదన్నావు. నీతోనే తీసుకొచ్చి! యిదేం హాస్యం చెప్పూ!" అని మామామగారు అంటూ ఉంటె నేను తెల్లబోయాను. జనార్దన్ మాత్రం విరగబడినవ్వుతున్నాడు. మా కాబోయేతోడల్లుడు వాడనని నాకప్పుడు తెలిసింది. మా జనార్దన్ తానాడిన నాటకమంతా చెప్పేసరికి అంతా నవ్వుకున్నారు.

పంతుల కృష్ణారావు.

* * *

## శృంగభంగము

అప్పుడే ఏడున్నరయింది. బస్సు హారన్ వినిపించింది. ఎక్కడ బస్సు మిస్ అగుతావో అని కాఫీ చాల వేడిగా వున్నా రెండుగ్రుక్కలలో తాగేసి బస్సెక్కేను. శీతాకాలం కనక చాలా చలిగా వుంది. బస్సులో ప్రయాణీకులు ఎక్కువమంది లేరు. నలుగురుంటారేమో డ్రయివరు కండక్టరుకాక. బస్సు స్టార్టయింది. ఇంతలోకి ఎక్కడనుంచో పరుగెత్తుకొనివచ్చి నలుగురు పోలీసులు ఎక్కారు. వాళ్ళు పోలీసుస్టేషనువద్ద దిగిపోతామని కండక్టరుతోచెప్పి ఏదో తీవ్రంగా మాట్లాడుకుంటూ మధ్య మధ్య నవ్వుతున్నారు. డ్రైవరు స్పష్టంగా గొణుగుకోవడం విన్నాను నేను "డబ్బిచ్చే పేసెంజర్లు లేకపోయినా F. S. పోలీసు......లు వదలరు" అని బస్సు పోలీసుస్టేషను దాటిపోయింది. కాని పోలీసులుమాత్రం ఏదో చెప్పుకొని నవ్వుకుంటున్నారు. ఇంతలో ఒకడు పోలీసుస్టేషను దాటిపోయిందని చూసి వెనకనున్న బెల్లును గణగణగణగణ కొట్టాడు. అది కొట్టింది పోలీసు అని తెలిసివుండి కూడా వాళ్ళకి ఎలాగయినా శృంగభంగంచేయాలని "ఓరి సన్యాసీ! నీకెన్నిసార్లు చెప్పినా బుద్ధి లేదెం? బెల్లు అన్నిసార్లు కొట్టవద్దంటే" అన్నాడు డ్రయివరు ఏహ్యాభావంతో. పాపం ఆ పోలీసు మొఖాన్ని గంటు వేసినా నెత్తురులేదు. ఇంతలో అన్నాడు కండక్టరు "కానిస్టేబులుగారండీ కొట్టారు" అని కష్టంమ్మీద నవ్వు అపుకుంటూ. "అయ్యో! మీరా? మాబుద్ధి లేని సన్యాసి అనుకున్నాను. తమరు 'డ్రైవరూ అపవోయ్' అంటె ఆపేవాణ్ణే అంటూ బ్రేకువేశాడు. పోలీసులు దిగి వెళ్ళిపోయారు నాటినుంచి నేటివరకూ వాళ్ళు మళ్ళా ఆబస్సు ఎక్కలేదు.

జి. వి. అప్పారావు పంతులు.